క్లుప్తంగా...

నేడు జూపార్కులో డైమండ్ జూబ్లీ వేడుకలు

బహదూర్‌పురా: జూపార్కులో డైమండ్ జూబ్లీ వేడుకల సందర్భంగా ఇంటిగ్రేటెడ్ టికెట్ ఆఫీసర్ ప్రారంభోత్సవం, కొత్త జూ లోగో, డైమండ్ జూబ్లీ ఫైలాన్, కొత్త ఈ-రోడ్డు రైలు ఫ్లాగ్ ఆఫ్, ఎన్‌క్లోజర్‌లోకి కపుచిన్ మంకీని విడుదల చేయడం, నామకరణ కార్యక్రమం ఉంటుందని జూపార్కు అధికారులు తెలిపారు. మొదటిసారిగా రెండు తెల్ల పులి పిల్లల ప్రదర్శన, జూపార్కు చిత్రం విడుదల, జూ కార్ఫ్స్ పరిచయం, జూపార్కులో ప్రధాన దత్తత తీసుకున్న వారికి సన్మానం కార్యక్రమం, పాఠశాలలు, జూపార్కు సిబ్బంది పిల్లలకు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

'వికలాంగులకు అండగా ఉంటా'



గోల్కొండ: వికలాంగులకు తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. గురువారం గోల్కొండలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రేటర్ వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాహెద్ అలీ ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. వికలాంగుల స్వయం ఉపాధి కోసం తాను అండగా ఉంటానని దీని కోసం పార్టీ తరఫునే కాకుండా ప్రభుత్వం పరంగా కూడా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం



గోల్కొండలో పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేయిస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన కార్వాన్‌లోని కార్వాన్, గోల్కొండ, గుడిమల్కాపూర్ డివిజన్‌లోని సత్యనారాయణనగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఆయన వెంట పలువురు మజ్లిస్ నాయకులున్నారు.


సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలి



చీరలను అందజేస్తున్న కృష్ణరాజేశ్వరి

చార్మినార్: సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ చురుగ్గా పాల్గొని సమాజంలోని పేద ప్రజలను తమవంతు సహాయ సహకారాలు అందజేయాల్సిన అవసరముందని ప్రముఖ సంఘ సేవకుడు, షాలీమార్ చానల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.కృష్ణ అన్నారు. స్వర్గీయ ఎస్.రాజమణి, ఎస్.ఈశ్వర్ రావుల జ్ఞాపకార్థం గురువారం పాతబస్తీలోని పేదలకు ఆహార పదార్థాలతో పాటు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలోని పేద ప్రజలు ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సంజయ్ సింగ్ అరెస్ట్ సరికాదు



నిరసన తెలుపుతున్న ఆమ్‌ఆద్మీ రాష్ట్ర కన్వీనర్ సుధాకర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: కేంద్రప్రభుత్వం ప్రశ్నించే గొంతులను అణచి వేయడానికి దర్యాప్తు సంస్థలను ఆయుధంగా ప్రయోగిస్తుందని ఆమ్‌ఆద్మీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిండి సుధాకర్ ఆరోపించారు. ఆదాని కుంభకోణాలపై పార్లమెంటులో గళం విప్పిన సంజయ్ సింగ్‌ను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ గురువారం బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి ఆధారాలు చూపించకుండా పార్లమెంటు సభ్యుడిని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అనంతరం కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించిన పార్టీ శ్రేణులను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు బుర్రా రాముగౌడ్, అధికార ప్రతినిధులు ప్రవీణ్ యాదవ్, వినయ్ రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ పాల్గొన్నారు.

మజ్లిస్ పార్టీకి అన్ని వర్గాల ఆదరణ

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ



టోలిచౌకిలో పనులను ప్రారంభిస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

గోల్కొండ: మజ్లిస్ పార్టీకి అన్ని వర్గాల ప్రజల ఆదరణ ఉందని హైదరాబాద్ ఎంపీ, మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. గురువారం ఆయన కార్వాన్ డివిజన్‌లో రూ.34 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్‌తో కలిసి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ పార్టీని అర్థం చేసుకున్న వారు ఆ పార్టీని విమర్శించరని, పార్టీ పని తీరును గుర్తుపట్టలేని వారే విమర్శిస్తున్నారన్నారు. దశాబ్దాలుగా ప్రజల వెంట ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్న తమకు అధికారంతో సంబంధం లేదన్నారు. ప్రభుత్వంలో ఎవరు ఉన్నా కూడా సమస్యలపై నిలదీసి వాటి పరిష్కారానికి పోరాడి నిధులు సాధించుకుంటూ వస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఏ పార్టీకి కూడా తాము భాగస్వాములుగా ఉండమనిసూటిగా మాట్లాడడమే తమ లక్ష్యమని ఆయన అన్నారు. కార్వాన్ నియోజకవర్గాన్ని నగరంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. పేద, బడుగు వర్గాల



ఎంపీ అసదుద్దీన్‌కు పగిడి బహూకరిస్తున్న రేణుక

వారితో పాటు వలస కూలీలు కూడా కార్వాన్‌లో ఎక్కువ సంఖ్యలో ఉన్నారని అయితే వారందరి అభ్యున్నతి కోసం తాము కృషి చేస్తున్నామని ఆయన అన్నారు. జియాగూడ కమేలాను ఆధునీకరించేందుకు ప్రతిపాదనలు ఉన్నాయని నియోజకవర్గంలో రూ.292 కోట్లతో మోడ్రన్ డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. అంతే కాకుండా కార్వాన్ నియోజకవర్గంలో రోడ్లను కూడా ఆధునీకరించామని ఆయన పేర్కొన్నారు. గోల్కొండలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటుచేయడం వెనుక తన కృషి ఎంతగానో ఉందని ఆయన అన్నారు. కార్వాన్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం తాను ఎంపీ లాడ్ నిధులు కేటాయించానని ఆయన అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ దళితబంధు పథకం విజయవంతం చేయడానికి ఎంతగానో కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు హారూన్‌ఫారాన్, బదరుద్దీన్, అజీజ్‌ఖాన్ పటాన్ తదితరులున్నారు.

లంగర్‌హౌజ్‌లో అభివృద్ధి పనుల ప్రారంభం..

లంగర్‌హౌజ్: పార్టీలకు అతీతంగా ప్రజల శ్రేయస్సుకు అహర్నిశలు పాటుపడే పార్టీ కేవలం ఎంఐఎం అని ఎంపీ అసదుద్దీన్ అన్నారు. లంగర్‌హౌజ్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకురాలు మత్స్య రేణుక ఎంపీ అసదుద్దీన్‌కు పగిడి బహూకరించింది. స్థానికులతో కలిసి పెద్ద ఎత్తున నాయకులు ఎంపీని సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. నాయకులు శివశంకర్, రవి యాదవ్, శారధా, సునంద పాల్గొన్నారు.

దుర్గామాత నవరాత్రుల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న త్రిదండి దేవానాథ రామానుజజీయర్

సుల్తాన్‌బజార్: భారతీయ సంస్కృతి ధర్మాన్ని కాపాడుకునేందుకు ప్రజలు ఐక్యతతో ముందుకు సాగాలని త్రిదండి దేవానాథ రామానుజజీయర్ స్వామి పిలుపునిచ్చారు. నవదుర్గ నవరాత్రి ఉత్సవ సమితి వ్యవస్థాపకుడు గులాబ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నెలకొల్పనున్న దేశంలోనే అతిపెద్ద 55 అడుగుల దుర్గామాత నవరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను త్రిదండి దేవానాథ రామానుజజీయర్ స్వామి ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం రూపుదిద్దుకుంటున్న 55 అడుగుల దుర్గామాతకు స్వామీజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ సాంస్కృతిక, ఆధ్యాత్మిక జీవన విధానాన్ని దైవం నడిపిస్తుందన్నారు. చంద్రాయన్-3ని అమెరికా లక్షల కోట్లు ఖర్చు చేసినా సాధించలేక పోయిందని, 600 కోట్లతో భారతదేశం సమర్థవంతంగా సాధించిందన్నారు. ఖైరతాబాద్ వినాయకుడి వల్లే 24 ఏళ్లుగా గులాబ్ శ్రీనివాస్ నేతృత్వంలో అతిపెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ విగ్రహం ఎన్నో రికార్డులు సాధించాలని ఆకాంక్షించారు. నాయకులు దిలీప్ ఘనాటే, శీలం సర్వతి, సతీష్, బబ్లు, ఆశీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'వారణాసి' పుస్తకావిష్కరణ

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నగరంలోని రవీంద్రభారతి వేదికగా నేడు 'వారణాసి' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ 'వారణాసి'పుస్తకం వారణాసి యాత్ర విశేషాలను, అక్కడి ప్రశస్తి, స్థానికి, సామాజిక స్థితిగతులపైన సమగ్రంగా విశదీకరిస్తూ యువ రచయిత వినోద్ మామిడాల రచించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత నిఖిలేశ్వర్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరిక్రిష్ణతో పాటు పలువురు సాహిత్య ప్రముఖులు పాల్గొననున్నారని నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ పుస్తక ఆవిష్కరణకు సాహిత్య ప్రియులు, యాత్ర ప్రేమికులకు ఆహ్వానం పలుకుతున్నామని వారు పేర్కొన్నారు.

'గురు శిష్యుల అనుబంధం ఎంతో గొప్పది'



శ్యామ్‌సుందర్‌జీను సత్కరిస్తున్న మామిడి హరికృష్ణ, ప్రిన్సిపల్ పాండురంగ

సుల్తాన్‌బజార్: తెగులు భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ గురు శిష్యుల అనుబంధం ఎంతో గొప్పదని గురువుతో నేర్చుకున్న విద్య సార్థకతం అవుతుందని తెలుగు భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. గురువారం రామ్‌కోఠిలోని శ్రీ త్యాగరాజ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, శ్రీ త్యాగరాజ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో కళార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సితార విద్వాంసులు గురువులు బాపూజీ శ్యామ్‌సుందర్‌కు గురు సత్కారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మామిడి హరికృష్ణ హాజరై కళార్చన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీణ, కళ, కూచిపూడి కళాశాలల విద్యార్థులు ప్రదర్శించారు. హరికృష్ణ మాట్లాడుతూ..స్వరమైన వాయిద్యమైన తప్పు దొరలకుండా ఉండాలంటే గురుముఖ విద్య తప్పనిసరి అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ పాండురంగ ముతాలిక్, గురుజీ వజేందర్, గురువులు జయలక్ష్మి, రవీంద్ర రాజు, భాగ్యలత తదితరులు పాల్గొన్నారు.

ఉద్దేశపూర్వకంగా ఓట్లను తొలగించడం సరికాదు



చార్మినార్: పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో ఒక వర్గానికి చెందిన ఓట్లను తొలగించారని పాతబస్తీ చార్మినార్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు టి. ఉమామహేంద్ర, బి.సురేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. బతికున్న ఓటర్లను సైతం చనిపోయినట్లు ఓటరు లిస్టు నుంచి తొలగించారని ఆరోపించారు. కొత్తగా ఓటర్లను నమోదు చేసుకున్నప్పటికీ.. ఆయా అప్లికేషన్లను చెత్తబుట్టల్లో పడేశారని.. తమ వర్గానికి చెందిన ఏ ఒక్క ఓటును కొత్త ఓటరు లిస్టులో చేర్చలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పురానాపూల్ డివిజన్ నుంచి గతంలో జరిగిన జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ తరఫున కార్పొరేటర్‌గా పోటీ చేసిన తన పేరును సైతం ప్రస్తుతం కొత్తగా ప్రవేశపెట్టిన ఓటరు లిస్టులో తొలగించడం ఎంత వరకు సమంజసమని చార్మినార్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ బి.సురేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో ఉద్దేశపూర్వకంగా ఒక వర్గం వారి ఓట్లను తొలగించడం సరికాన్నారు. ఇప్పటికైనా తొలగించిన ఓట్లపై విచారణ జరిపించి వెంటనే నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు.

జీహెచ్‌ఎంసీ సమస్యలు వెంటనే పరిష్కరిస్తాం



జోనల్ కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలోని పలు విభాగాల సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రే పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆయనను కలిసి జీహెచ్‌ఎంసీకి చెందిన పలు సమస్యలు వివరించారు. ఎంజే మార్కెట్‌లో ఐమాక్స్ లైట్లు, పలు ప్రాంతాల్లో వెలగని ఎల్‌ఈడీ లైట్స్, కొన్ని ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు, ఇతర సమస్యలను జోనల్ కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ..వెంటనే సంబంధిత అధికారులచే అన్ని సమస్యల పరిష్కారం చేయిస్తామని హామీ ఇచ్చారు. ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సహకారంతో నియోజకవర్గంలో కోట్లాది రూపాయాల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలు ఉన్నా లేకున్నా 365 రోజుల పాటు గోషామహల్ నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలకు పరిష్కారం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అహ్మద్, విజయ్ ముదిరాజ్, నరేష్‌గౌడ్, భాస్కర్, షఫీ, నర్సింగ్, రాము, భజన్, పవన్, బాబు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

డబీర్‌పురా: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మలక్‌పేట్‌లోని ఎంఎన్ ఏరియా ఆస్పత్రిలో లక్ష్మి (60) అనే వృద్ధురాలిని ఈనెల 3న ఉదయం 10.30 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి చికిత్స నిమిత్తం చేర్పించారు. చికిత్స పొందుతున్న లక్ష్మి మధ్యాహ్నం 12 గంటలకు మృతి చెందింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హుక్కా ఫ్లేవర్స్ దొంగల ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్లు నర్సింహారాజు, నర్సింహ

అబిడ్స్: హుక్కా ఫ్లేవర్స్ ముడిపదార్థాలను దొంగిలించిన ముఠాను అబిడ్స్ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్లు నర్సింహారాజు, నర్సింహులతో కలిసి ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో అబిడ్స్ డివిజన్ ఏసీపీ ఆకుల చంద్రశేఖర్ వివరాలు వెల్లడించారు. చాదర్‌ఘాట్‌కు చెందిన మహ్మద్ ఇర్ఫాన్, మహ్మద్ సోహేల్, మహ్మద్ మసూద్, మహ్మద్ ఆతేర్ ఒక ముఠాగా ఏర్పడి దొంగతనానికి పాల్పడ్డారు. గతనెల 29న ఎంజేమార్కెట్‌లోని హుక్కాషాపులో షట్టర్ విరగొట్టి హుక్కా ముడిపదార్థాలను దొంగిలించారు. గురువారం ట్రూప్‌బజార్‌లోని అగర్వాల్ చాంబర్ వద్ద దొంగిలించిన హుక్కా ముడిపదార్థాన్ని విక్రయించేందుకు ప్రయత్నించారు. విధుల్లో పోలీసులకు అనుమానం వచ్చి తనిఖీలు చేయడంతో ఆ ఆటోలో ఉన్న హుక్కా ముడిపదార్థం దొంగిలించినట్లు పోలీసులు నిర్ధారించారు. నలుగురు సభ్యులతో పాటు ఒక ఆటో, రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. నలుగురు నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. రూ.2.30 లక్షల విలువైన హుక్కా ముడిపదార్థాలను పోలీసులు సీజ్ చేశారు. ఈ కేసును అబిడ్స్ ఇన్‌స్పెక్టర్లు నర్సింహారాజు, నర్సింహా ఆధ్వర్యంలో డీఎస్ఐ గౌరేందర్ గౌడ్ దర్యాప్తు చేస్తున్నారు.

ఫలక్‌నుమా నుంచి ఎయిర్‌పోర్టు, హైటెక్ సిటీకి రైలు సౌకర్యం కల్పించాలి



సౌత్ సెంట్రల్ రైల్వే జీఎంకు వినతిపత్రం అందిస్తున్న గడ్డి చంద్రశేఖర్

లంగర్‌హౌజ్: ఫలక్‌నుమా నుంచి ఎయిర్‌పోర్టు, హైటెక్‌సిటీకి రైలు సౌకర్యం కల్పించాలని కోరుతూ సౌత్ సెంట్రల్ రైల్వే జెడ్‌ఆర్‌యూ సీసీ సభ్యుడు గడ్డి చంద్రశేఖర్ కోరారు. గురువారం సికింద్రాబాద్ రైల్ భవన్‌లో జెడ్‌ఆర్‌యూసీసీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యుడు గడ్డి చంద్రశేఖర్ సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఫలక్‌నుమా నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లే వారి సంఖ్య బాగా పెరిగిందని, శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి హైటెక్ సిటీ వైపు వెళ్లే వారి సంఖ్య కూడా బాగా పెరిగిందని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ రెండు రూట్లలో రైళ్లను వేస్తే ప్రతి నిత్యం వేలాది మందికి ప్రయోజనం చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు.

ఏపీ సీఎం వైఎస్. జగన్‌ను కలిసిన మెట్టు శ్రీకాంత్



అబిడ్స్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, తెలంగాణ రాష్ట్ర డెంటిస్టు అసోసియేషన్ నాయకుడు డాక్టర్ మెట్టు శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. నగరం నుంచి విజయవాడకు వెళ్లిన మెట్టు శ్రీకాంత్ వైఎస్ జగన్‌ను కలిసి ఏపీ రాష్ట్రంలో ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల పట్ల ఆయన అభినందనలు తెలిపారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



పార్టీలో చేరిన వారికి స్వాగతం పలుకుతున్న మహేష్‌కుమార్‌గౌడ్

గోల్కొండ: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. నియోజకవర్గం నుంచి వివిధ పార్టీలకు చెందిన నాయకులు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కురాకుల కృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిని ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. బీజేపీతో పాటు బీఆర్‌ఎస్‌కు చెందిన సీనియర్ నాయకులు తమతమ పార్టీలను వదిలి కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. దీనిని బట్టి బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు రాష్ట్రంలో ప్రజాభిమానం కోల్పోయాయని స్పష్టమవుతుందని ఆయన పేర్కొన్నారు. పాలక బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అవినీతి మరకలు లెక్కలేనంతగా అంటుకున్నాయని, ప్రజలు దీనిని అసహించుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంటి బాబు, ఎం.రఘుపాల్‌రెడ్డి, ఏ.చంద్రశేఖర్, ప్రేమ్‌కిషోర్, వినోద్‌సింగ్ తదితరులున్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



జీఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకుడు దేవర వంశీ తదితరులు

గోల్కొండ: ఉషోదయ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని బీజేపీ నాయకుడు జలమండలి జీఎం మహేందర్‌ను కోరారు. వారు గురువారం గుడిమల్కాపూర్‌లోని జలమండలి కార్యాలయంలో జీఎం మహేందర్‌కు వినతిపత్రం అందజేశారు. రోడ్డుపై మురుగు నీటితో పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇళ్లల్లోకి డ్రైనేజీ మురుగు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా ఉండే ప్రజలు డ్రైనేజీ సమస్య కారణంగా అనారోగ్యాలబారినపడుతున్నారన్నారు. స్థానిక అధికారులకు ఈ డ్రైనేజీ విషయం తెలిసినా పట్టించుకోవడం లేదన్నారు. సంబంధిత కాలనీ అధికారితో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని జనరల్ మేనేజర్ మహేందర్ తనకు కలిసిన వారికి హామీ ఇచ్చారు. బీజేపీ నాయకుడు దేవర వంశీతో పాటు ఉషోదయ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులున్నారు.

గడ్డం ఆత్మీయ సమ్మేళనానికి భారీ ఏర్పాట్లు



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్

అబిడ్స్: ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈనెల 6న శుక్రవారం భారీ ఎత్తున గడ్డం గంగాధర్ యాదవ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నారు. ఆత్మీయ సమ్మేళనానికి గోషామహల్ నియోజకవర్గంలోని పలు మురికివాడలు, బస్తీలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు, నగర గ్రంథాలయ మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గురువారం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో గడ్డం ఆత్మీయ సమ్మేళన ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. అనంతరం గడ్డం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో వేలాది మందికి ఇంటర్, డిగ్రీ, పీజీలలో ఉచితంగా గడ్డం గంగాధర్ యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యను బోధిస్తున్నానని తెలిపారు. స్థానిక ప్రజలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తమ అభిమానులు దాదాపు 10 వేల మందితో ఆతీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆత్మీయ సమ్మేళనం ప్రారంభమవుతుందన్నారు. వరల్డ్ ఫేమస్ ప్యారడైజ్ బిర్యాని, ఇతర వంటకాలతో ఆత్మీయ సమ్మేళనం చేపడుతున్నట్లు వివరించారు.

9న క్రాంతి నాటక ప్రదర్శన

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర భాషా సాంస్కృతిక సౌజన్యంతో క్రియేటీవ్ థియేటర్ ఆధ్వర్యంలో ఈనెల 9న రవీంద్రభారతిలో క్రాంతి అనే నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు అజయ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సమాజంలో పరిస్థితులను ప్రతిబింబించే విధంగా ఈ నాటకం ఉంటుందని పేర్కొన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత మెర్సీ మార్గరేట్ రచించిన ఈ నాటకాన్ని భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు.

నేడు పాతబస్తీలో మంత్రి కేటీఆర్ పర్యటన

చార్మినార్: పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో మంత్రి కేటీఆర్ ఈనెల 6న ఉదయం పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనతో పాటు గుల్జార్‌హౌజ్ ఫౌంటెన్ ప్రారంభోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. దాదాపు రూ.180 కోట్లకు పైగా నిధులతో ఈ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఇప్పటికే రూ.29.50 లక్షలతో సుందరీకరణ చేపట్టిన చార్మినార్-గుల్జార్‌హౌజ్ ఫౌంటేన్‌ను ప్రారంభించనున్నారు. దీంతో పాటు మూసీనదిపై కొత్తగా నిర్మించనున్న రెండు ఐకానిక్ పాదచారుల బ్రిడ్జిలను ప్రారంభించనున్నారు. రూ.34.6 కోట్ల నిధులతో ఈ మల్టీ లెవల్ పార్కింగ్ నిర్మాణ పనులు జరగనున్నాయి. అలాగే రూ.36 కోట్లతో లాడ్‌బజార్‌లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రి కేటీఆర్ హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో కలిసి ప్రారంభించనున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

విజయనగర్‌కాలనీ: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం వెలుగుచూసింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐ ఆదిల్ రియాజ్‌ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. గుడిమల్కాపూర్‌లో ఓ వ్యక్తి విద్యుత్ స్తంభం, కరెంటు తీగల వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని ఈనెల 4న పోలీసులకు సమాచారం వచ్చింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్పృహలేకుండా పడిఉన్న వ్యక్తి కూలీపనులు చేసుకుని జీవించే బిహార్‌కు చెందిన సుధీర్‌రామ్(40)గా గుర్తించారు. బాధితుడిని వైద్య చికిత్సల నిమిత్తం ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విద్యుత్‌షాక్‌కు గురైనట్లు మృతుడి ఒంటిపై గాయాలు ఉన్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించి అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.